# కుక్కకాటుకి చెప్పుదెబ్బ

కు చూశాను. అయిదున్నరయింది.

తిరుగుముఖం పట్టటం శ్రేయస్కర మని తోచింది. అదీగాక చాలదూరం వచ్చేశాను. పెందలకడనే రూముకి చేరుకుందామనే ఉద్దేశ్యంతో వెనకకు తిరిగాను.

చల్లగాలి ప్రారంభించింది. ఎన్నాళ్ళయిందో సుఖంగా చల్లగాలి పీల్చి అన్నట్లున్నది నడుస్తూఉంటే. దినం గడవటం కష్టంగా ఉన్నది ఊళ్లో. గాలి ఉన్నకొద్దికీ ఎక్కువైపోతోంది. ఎందుకైనా మంచిదని నడక వేగం హెచ్చించాను.

అంతవరకు చెత్త రేగేస్తున్న ఎండ కాస్తా మాయమయిపోయింది. ఎక్కడనుంచో మేఘాలు వచ్చి పడుతున్నయ్. ఒక్క నిముషంలో అంతా చీకట్లు కమ్ముకున్నయ్. గాలి ఆ చెవిలోనుంచి ఈ చెవిలోకి కొట్టేస్తున్నది. పైగా మెరుపులు, ఉరుములుకూడ ప్రారంభమైనయ్.

అదే పనిగా నడుస్తున్నాను, వాన కురవకముందే, తడవకుండా ఇంటికి చేరుకుందామని. ఇంకా ఊరు మూడుమైళ్ళుంటుంది సుమారు. అప్రయత్నంగా అనుకోకుండానే ఇంతదూరం షికారు వచ్చినందుకు అప్పుడు విచారించటం ప్రారంభించాను. నడుస్తూనే ఇదంతా. ఆపని చేయకముందు నాకే చీకూచింతా ఉండదు. ఏదో ఒకపనిచేయటం చేసిన తరువాత విచారించటం నాకు పరిపాటయిపోయింది.

మూలిగే నక్కమీద తాటికాయ పడ్డది. అసలే ఏడుస్తో నడుస్తున్నాను. వాన ప్రారంభం కానేఅయింది. గాలీ తగ్గటం లేదు, హెచ్చటమేగాని. ఒక్కొక్క ఉరుము ఉరుముతూంటే, ఒక్కొక్క మెరుపు మెరుస్తుంటే మతిపోయినంత పనవుతోంది.

ధైర్యంచేసి ముందుకుసాగిపోతున్నాను. నేను ముందుకి ఒక అడుగు వేసినకొందికే వానకూడ ఒక అడుగు ముందుకు వేయటం సాగించింది. అంతకంతకూ ఎక్కువైంది వర్షం.

ఇంతలో ఒక మర్రిచెట్టు దగ్గరకు వచ్చాను; కాస్సేపు చూసి వర్షం వెలిశాక పోదామని. ఇంకా బట్టలు తడవలేదు. తడిస్తే అవిధంగానే పోదును. తడిసేవరకే ఈ బాధంతానూ.

అనేక మహావృక్షం దాని వయస్సెంతో నిర్ణయించటం నా చేతకాదు. పైకి చూశాను. అంతా చీకటి. చిన్నప్పుడు చెప్పుకొనే దయ్యాలకథలు జ్ఞాపకం వచ్చినయ్. మరి కాస్సేపు అలాగే చూస్తే ఆ కథలన్నీ చిత్రాలు కావచ్చునని భయంతో తల దించేసుకున్నాను.

ఇంతలో ఓ కారు పోయింది తుర్రుమని. దాంట్లో డ్రైవరుతప్ప ఎవ్వడూ ఉన్నట్లు కనుపించలేదు. ఒక్కడే ఏడవకపోతే, దారిప్రక్కన, మర్రి క్రింద అవస్థపడే నాలాటివాడిని ఎక్కించుకోగూడదూ? ఆ మాత్రం జ్ఞానం వాళ్ళకుండాలిగాని మనం చెపితే వస్తుందా? అనుకున్నాను.

అలా అనుకొని ఊరుకొంటే బాగానే ఉండేది. ఈసారి వచ్చే కారుని ఆపి మరీ ఎక్కుదామనే ఉద్దేశ్యపడ్డాను. ఇంతలో ఓ కారు రానేవచ్చింది. ఆపటానికి ధైర్యం చాలలేదు. ఆపుదామా? వద్దా? అని తికమకపడుతూనే ఉన్నాను. అది పోనేపోయింది. ఈసారి మనస్సు దిట్టపరచుకొని కారుకోసం ఎదురుచూడటం ప్రారంభించాను.

నేనుమాత్రం సరదాకిగాని, వాళ్ళను గోలచేయటానికిగాని ఆపటం లేదుగా? అవస్థపడుతున్నాను గాబట్టి సహాయం అర్థిస్తున్నాను. అదీగాక ఎదుటివాళ్లు నాకు కావలసిన సహాయం చేయగలరు కాబట్టి అడుగుతున్నాను. అవసరంలో ఉన్నాను గాబట్టి అడగటం నా విధి. అవసరం తీర్చగలవారువారే కాబట్టి సహాయంచేయటం వాళ్ల విధి. ఇందులో తప్పుకీ, ఒప్పుకీ ఆస్కారం లేదని నన్ను నేనే సమాధానపరచుకొన్నాను.


ఈసారి ధైర్యంగా నిలబడ్డాను. వచ్చిన కారుని తప్పక అపాలని పట్టుదల. ఇంతలో కారుమోత వినిపించింది. చెవులు నిక్కబొడుచుకున్నయ్. ఆ వైపు చూశాను. ఏమీ కారు వస్తున్న జాడలు కనుపించటంలేదు. అటు చూస్తూనే ఉన్నాను. ఇటునుంచి తుర్రున ఓ కారు వచ్చిపోయింది. అయినా, ఇటుపోయే కారుతో తనకేం పని?

టైము చూసుకున్నాను. సరిగ్గా అయిదు నిముషాల తక్కువ ఆరయింది. హారన్ వినిపించింది. ఆదుర్దాగా చూశాను ఆవైపు. ఓ చిన్న 'చెవ్రొలెట్' కారువస్తోంది. ధైర్యంచేసి చేతిమీద చొక్కా పైకితీసి, చెయ్యిచాచి గాలిలో ఆడించాను.

నడుపుతూన్న పెద్దమనిషి నా వంక చూశాడు. కాని కారు ఆగలేదు. అదీ నా బాధ. కారు ఆగకపోతేపోయింది. అతను చూడకుండా ఉన్నందువలన ఆగకపోతే సంతోషించేవాడినే. చూసికూడ ఆగకుండా నిర్లక్ష్యంగా చూస్తూ వెళ్లిపోయాడు. పోనీ అతను చూస్తే చూశాడు. ప్రక్కనున్న లలనాంగికూడ చూసింది. ఏమిటో వాళ్ల ఎక్కువదనం. చూపుల నిండా అదే. ఒక కారులో కూర్చోగానే అంతా తీరిపోయినట్లు భావించటం.

అయినా నాపిచ్చి గాకపోతే మరేమిటి? ఎవరో మొగుడూ పెళ్లాం కారు వేసుకుని, జోరువానలో, చలిగాలిలో, చక్కగా, ఒంటరిగా పోతుంటే మధ్యలో, పానకంలో పుడకలా అడ్డుపడట మేమిటి? నా తెలివి తక్కువతనానికి నేనే ఆశ్చర్యపడ్డ క్షణాలలో అదొకటి. నేను గనుక అలా కారులో పెళ్లాంతోపోతూ ఉంటే ఆపేవాడినా? లేదు. లేనపుడు ఆ, ఆ పనివాడిని తిట్టడం దండుగ. ఏమిటో చర్చ సాగిపోతున్నది.

టైము సాగిపోతున్నది. చీకటికూడ సాగుతున్నది. ఉరుములు, మెరుపులుకూడ సాగుతున్నయ్. అన్నిటితోపాటు నా భయంకూడ సాగుతోంది.



బెజవాడ డిపో, సూర్యారావుపేట.

అసలు బస్సు వచ్చే సూచనలు కన్పించటం లేదు. బస్సు రాకపోతే ఆపూట నా పని సున్న. ఎంత చూసినా కారు రావటం లేదు. వాన వెలవటం లేదు. భయం పోవటం లేదు. ఏంచేయాలో తోచటం లేదు. మరి కాస్సేపు అలాగే ఉండిపోవటం సంభవించినా కారు ఆగకుండా వెళ్లిపోవటం సంభవించినా, ఆ రాత్రికి నా పాట్లు కుక్కలన్నా పడవు.

చీకటి, బయటా లోపలా కూడ ఎక్కువై పోతోంది. ఈసారి మంచి ఉపాయం తోచింది. ఈసారి ఇటువైపు వచ్చిన కారు ఆగకుండా పోవటానికి వీలు లేదు. అసలు ఇటువైపు వస్తేగా? అదొక పెద్ద ఆశాభంగం. ఇంతవరకూ వచ్చిన కార్లను ఆపలేకపోయాను. ఇకముందు వచ్చే కార్లను ఆపగలను. ఆపగలను గాబట్టి అవి రావు. జరగబోయేది అంతే ననుకొని ఆ మెరుపుల్లో నేను కూడ ఒక మెరుపు తీగలా నిలబడ్డాను.

కారుమోత వినిపించనే వినిపించింది. మధ్యలో నాకో అనుమానం తట్టింది. వాడు అంతా చూసి భయంపుట్టి ఆపకుండా పోనూ వచ్చు, ఇక్కడెవరూ మనుషులు లేరు గాబట్టి ఏమైతే అదవుతుందని నడక ప్రారంభించాను, అరచేతుల్లో ప్రాణాలు పెట్టుకుని. అసలు దాదాపు ప్రాణాలమీద చాలవరకు ఆశ వదులుకొనే రోడ్డు పట్టాను.

కారు హారన్ వినిపించింది. తొణకకుండా నడుస్తున్నాను. మళ్లా వినిపించింది. ఎటూ గాకుండా నడుస్తూ ఒక ప్రక్కకి తొలిగాను. కారు నా ప్రక్కకి వచ్చింది. ఎగిరి ఒక్క గంతేసి, అరుస్తూ రోడ్డు ప్రక్కనే పడిపోయాను, కారు నంబరు కేసి చూస్తున్నట్లు నటిస్తూ. కారు ఆగిపోయింది. ఆ నడిపే పెద్దమనిషి నాకు దగ్గరగా వచ్చాడు.

నా వళ్ళంతా మట్టి కానే అయింది. పోనీలే నడవటం తప్పిందిగదా అనుకుంటూ 'అబ్బ, ఉష్' అనుకుంటున్నాను.

"సారీసార్, కారులోకి రండి. పట్టుకుంటాను నేను." అన్నాడాయన. అంటూ ఉండగానే నేను లేచి కారులోకి పోయి కూర్చుందా మనుకున్నాను గాని, నాకు దెబ్బలు తగలలేదని అనుమానం వేస్తే ప్రమాదం. నా కప్పుడు అసలు తగలవలసిన దెబ్బలు తగులగల అవకాశా లున్నయ్.

రెండు చేతులతో నన్ను పట్టుకొని లేపబోయాడు. ఆయన లేపబోయినకొందికే నేను జేరగిలబడ్డాను. ఆయన తన కారు మూలంగానే నాకు దెబ్బలు తగిలాయనుకున్నాడు.

"కాళ్లు నొప్పి పట్టాయాండీ?" అన్నాడాయన.

"నొప్పిపట్టట మేమిటి? ఈ తొంటె విరిగిపోయినట్లుం టేను." అన్నా, ఏడుపు ముఖం పెట్టి.


ఆయనే నన్ను పూర్తిగా లేవదీశాడు. నేనుమాత్రం మునిగాళ్లమీద నడుస్తున్నట్లు నటించాను. అమాంతం నన్ను మోసుకు పోయినట్లు తీసుకుపోయి కారులో కూర్చోబెట్టుకొన్నాడు.

వెచ్చగా, హాయిగా ఉన్నది. అబ్బ, అమ్మ అంటూనే ఉన్నాను మధ్య మధ్య, నమ్మకం పోకుండా ఉండటంకోసం. టైము చూసుకున్నాను. ఆరున్నరయింది. ప్రొద్దుకూకుతోంది. మునిసిపల్ దీపాలు వెలుగుతున్నయ్. అప్పుడే దాదాపు ఊళ్లోకి వచ్చా మన్నమాట.

రెడీగా కూర్చున్నాను బయటకు చూస్తూ. మా రూము రానేవచ్చింది.

"ఇక్కడ ఆపండిసార్. మా రూమ్ వచ్చేసింది." అన్నాను.

కారు ఆపాడు ఒక్కసారి.



"హాస్పిటల్‌కు పోయివద్దాం. మళ్ళీ తీసుకువచ్చి దిగవిడుస్తాలెండి." అంటున్నాడాయన.

నేను ఒక్క గంతులో బయటకు దూకాను. ఆయన ఆశ్చర్యపోతూ చూస్తున్నాడు.

"వస్తాను. *Thank you Sir.* నాకు దెబ్బలు తగిలితేగా హాస్పిటల్ కి రావటానికి" అన్నాను.

కారు స్టార్టు చేస్తున్నాడు. పోతూ పోతూ ఊరుకుండలేకపోయాను. "*Thank you for your Coneyenence*" అంటూ పోబోయాను. నవ్వు ఆగింది కాదు.

కారు బయల్దేరింది. నా *Thanks*, నవ్వులూ ఆ మోతలో ఆయనకు వినపడ్డాయో, లేదో? బహుశః వినిపించే ఉండాలి.

*   *   *   *

ఆ రోజు సాయంకాలం వద్దనుకుంటూనే ఓ కారుకి బయల్దేరాను. బయల్దేరినందుకు అంతా బాగానే ఉన్నట్లు తోచింది. ఓ సిగరెట్ వెలిగించుకొని రోడ్డునే పోతున్నాను. ఎత్తు ఎక్కాను ఎలాగైతేనేం. మళ్ళా దిగాలి. దిగుతూ ఉన్నాను సిగరెట్ పొగ పీలుస్తూ, ఆలోచిస్తూ.

కారుమోత వినిపించింది. వెనక్కు తిరిగి చూశాను. మరుక్షణంలో కారు ఆగిపోయింది. అటు తిరిగి నిలబడ్డాను. కారుని ఎక్కడో చూసినట్లు జ్ఞాపకం. ఎప్పుడో ఎక్కినట్లు కూడ జ్ఞాపకం.

ఇంతలో కారులోనుంచి ఒకాయన దిగాడు. ఎక్కడో చూసిన ముఖం.

"హల్లో సార్" అన్నాడాయన.

"ఏమండీ," అన్నాను.

"కొంచెం ఇటు వచ్చి ఒక చిన్న సాయం చేస్తారా?" అన్నాడు.

నేను మాట్లాడకుండా కారుదగ్గరకు పోయాను.

"కారు నడపటం చేతనవునా మీకు?" అని అడిగాడాయన.

"ఎందుకు?" అన్నాను.

"కాదండీ! 'డౌన్' కదా అని ఇంజను ఆపేసి వస్తున్నాను. రాయి తగిలి ఆగిపోయింది. స్టార్టు కావటంలేదు. నేను వెనక నిలబడి తోస్తాను. మీరు స్టార్టు చెయ్యండి." అన్నాడాయన.

"నాకు కారునడపటం చేతకాదండీ." అన్నాను, ముఖం చిన్నది చేసుకుంటూ.

"ఫరవాలేదులెండి. ఇటువంటి కార్లలో ఒంటరిగా రావటం ప్రమాదం" అంటున్నాడాయన.

"పోనీ ఒకపని చేదాం. నేను వెనుక నిలబడి తోస్తాను. మీరే స్టార్టు చెయ్యండి" అన్నాను.

"మీ కెందుకంత శ్రమ..." అంటున్నాడాయన.

"ఫరవాలేదు. ఫరవాలేదు. కానివ్వండి" అంటూ కారు వెనకవైపుకి పోయాను.

"మొత్తంమీద మీకు శ్రమ కలిగిస్తున్నాను." అంటూ ఆయన 'స్టీరింగ్' ముందర కూలబడ్డాడు.

బలంకొద్దీ తోయటం సాగించాను. మొత్తం మీద కదిలింది కొంతసేపటికి నెట్టాను. మెల్లగా పోతోంది. ఆయన ప్రయత్నిస్తున్నట్లున్నాడు గాని అది మాత్రం స్టార్టు కావటంలేదు. దాదాపు అర ఫర్లాంగు తోశాను. "ఇంతవరకూ డౌన్ గాబట్టి సరిపోయింది. ఇకమీదట మీరుకూడ తొయ్యలేరు. ఫరవాలేదు. మరెవరైనా ఇద్దరు ముగ్గురు వచ్చినపుడు బ్రతిమలాడతాలెండి." అన్నాడాయన.

జేబు రుమాలుపెట్టి చెమట తుడుచుకొన్నాను.

"ఫరవాలేదులే, కానివ్వండి. ఎందుకు కదలదో చూద్దాం." అంటూనే మళ్లా నెట్టటం ప్రారంభించాను. మరో అరవై గజాలు నెట్టుకుపోయాను. వళ్ళంతా చెమటలు కారిపోతున్నాయ్. కారుమాత్రం కదలటం లేదు.

ఉన్నట్లుండి ఒక్కసారి కదిలింది కారు. బలమంతా దానిమీద మోపి ఉన్నానో ఏమో ముందుకు పడ్డాను. బ్రుమని కారు అర ఫర్లాంగు ముందుకు పోయింది. నా వళ్ళంతా మట్టయి, దోక్కుపోయింది

అక్కడ ఆగింది కారు. లోపలనుంచి ఆయన తల బయటకు పెట్టాడు.

"సారీ సార్. ఇందాకటినుంచీ మిమ్మల్ని అనవసరంగా కష్టపెట్టాను. *Accelerator* నొక్కబోయి మరోటి నొక్కాను. అందుచేత ఇందాకటినుంచి 'స్టార్ట్' కాలేదు. ఒక్కసారి నొక్కగానే మీరు ముందుకు పడ్డారు. సారీసార్. దెబ్బలు తగిలాయా? పడదోయాలని పడదొయ్యలేదు." అనుకుంటూ స్టార్టు చేసుకొని వెళ్ళిపోయాడు.

*Thanks* కూడ చెప్పనందుకు నాకు కోపం వచ్చినమాట నిజం. కారు నంబరు వంక చూశాను. *M S P* 143291. ఆ రోజు కారే.

గాలివాననాటి మర్రిచెట్టుక్రింద దృశ్యం కళ్ళకు కట్టినట్లు కనుపించింది. దుమ్ము గులుపుకుంటూ హాస్పిటల్ వైపు నడిచాను. ★




వస్తువ మహిమ నాణ్యతలో కానవచ్చును.

సశ్యములలో ఉత్తమమైనది పట్నం సశ్యము

కాని అత్యుత్తమమైనది

అప్పాదురై సశ్యమే

కారం, నాణ్యత, సువాసనకు పేరొందినది

అ. అప్పాదురై ముదలియార్ అండ్ సన్సు,

౭౫ ఆచారప్పన్ వీధి : : మదరాసు



